ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 • కనిష్ఠం 24.8



'హెచ్‌సీఏ మాటలు నమ్మి మోసపోవద్దు'

నిర్మల్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సీఏ మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కోచ్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ జిల్లాలో క్రికెట్ అభివృద్ధి గురించి టీసీఏ చేస్తున్న అభివృద్ధి ప్రణాళికలను కాపీ కొడుతూ గత 80 సంవత్సరంలో చేయని అభివృద్ధి ఇప్పుడు ఏదో సాధిస్తామంటూ హెచ్‌సీఏ చేస్తున్న చట్టబద్ధత లేని ప్రయత్నాలు గుర్తించబడమని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఈ విషయమై హెచ్‌సీఏపై బీసీసీఐ హైకోర్టుకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వరుణ దేవా.. కరుణించవా!



ఖానాపూర్‌లో కప్పతల్లి ఆడుతున్న చిన్నారులపై నీళ్లు పోస్తున్న స్థానిక మహిళ

- వర్షాలు కురవాలని ఖానాపూర్‌లో చిన్నారుల కప్పతల్లి ఆట

ఖానాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వరుణ దేవా కరుణించవా.. వర్షాన్ని కురిపించవా.. అంటూ కొంత మంది చిన్నారులు ఖానాపూర్‌లో సోమవారం కప్పతల్లి ఆటను ఆడారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీలో కొంత మంది చిన్నారులు ఓ కప్పను తీసుకొని దానిని ఓ గుడ్డతో రోకలి దడ్డుకు కట్టుకుని దప్పుల చప్పుళ్లతో ఇంటింటా తిరిగారు. అంతేకాకుండా ఇద్దరు చిన్నారులు కప్పను కట్టిన రోకలి దుడ్డును మోస్తూ మరికొంత మంది చిన్నారులు వారిని అనుకరిస్తూ ఖానాపూర్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీలో కప్పతల్లి ఆటను ఆడారు. కప్పతల్లి ఆడుతూ ఇంటికి వచ్చిన చిన్నారులకు నీళ్లు పోస్తూ కప్పతల్లి పూజలు నిర్వహిస్తూ వర్షం కురిసేలా ఆశీర్వదించాలని పలువురు కాలనీ వాసులు కోరుకున్నారు.

నేడు యాంత్రీకరణతో మాయం!

- నాడు పల్లెల్లో రైతు ఇంట ఎడ్లబండ్లతో ఉట్టిపడిన రాజసం



వ్యవసాయ పనులకు ఉపయోగించే ఎడ్ల బండి

సారంగాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జోడెడ్ల బండి గుర్తుందా.. నాడు గ్రామాల్లో రైతులు ఇంట ఉండేవి అప్పట్లో మంచి ఎడ్ల జత బండి ఉండటం సామాజిక హోదాగా భావించే వారు రైతు కుటుంబాలు. ఎడ్లను కన్నబిడ్డల వల్లె జాగ్రత్తగా చూసుకునే వారు. పల్లెటూర్లలో ఎడ్ల మండిపై వెళుతూ మంచి అనుభూతిని పొందేవారు. పూర్వం రైతులకు చేదోడుగా ఉన్న ఎడ్లబండ్లు ప్రస్తుతం యాంత్రిక విప్లవంతో కనుమరుగవుతున్నాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు వచ్చాక ఎడ్ల బండ్ల వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. గతంలో ఎడ్లను కన్నబిడ్డళ్ల చూసుకునేవాళ్లమని, ఇతర గ్రామాలకు ఎడ్ల బండ్లపై వెళ్లే వారమని స్థానిక రైతు ఓలత్రి నారాయణరెడ్డి పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శివకుమార్

ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా శివకుమార్ బాధ్యతల స్వీకరణ

ఖానాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ ఖానాపూర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా కే. శివ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శివ కుమార్ గతంలో చెన్నూరు అటవీరేంజ్ అధికారిగా పని చేసి ఇటీవల పదోన్నతిపై బాసర ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించచారు. ఇన్నాళ్లు ఉట్నూరు ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర ఖానాపూర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా విధులు నిర్వహించగా ఆ అదనపు బాధ్యతలను బాసర ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో కే. శివ కుమార్‌కు అప్పగిస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఖానాపూర్ ఎఫ్‌డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా శివ కుమార్ బాధ్యతలను స్వీకరించారు.

'సీఎం నివాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తాం'

నిర్మల్ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మంగళవారం ముఖ్యమంత్రి నివాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జూలై 21వ తేదీలోగా క్షమాపణలు చెప్పి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలిపారు.

'నేడు చలో గన్ పార్క్'

నిర్మల్ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మంగళవారం చలో గన్ పార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు కే. శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ కిరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలని ఆయనకోరారు.



- నిర్మల్ నుంచి ఖానాపూర్ వెళ్లే 61వ రహదారి ఇదే..



- అటవీ ప్రాంతం గుండా వెళ్లే 61వ జాతీయ రహదారి ఇదే..

అటవీ అనుమతులపై.. అయోమయం!

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలంటున్న ఉన్నతాధికారులు
- ప్రత్యామ్నాయానికి ఇక ఇదే మార్గం
- అభివృద్ధి పనులకు లభించని అనుమతులతో గిరిజనుల తప్పని అవస్థలు



- వన్యప్రాణుల కోసం నిర్మించిన ఎనిమల్ అండర్ పాస్ ఇదే..

నిర్మల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన పల్లెల్లో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిన అటవీ అనుమతుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సమీక్షించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను సంప్రదించాలని సూచనలు జారీ చేసింది. ఇటీవలే అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కల ఆధ్వర్యంలో అటవీ శాఖ అనుమతులపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కాలువల మరమ్మతులు, నిర్మాణాలతో పాటు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైన్లు, పోల్స్ ఏర్పాటు చేసి కరెంటు సౌకర్యం కల్పించడం లాంటి మౌలిక సౌకర్యాల కల్పనకు అటవీ శాఖ అనుమతులు ఆటంకంగా మారుతున్నాయి. చాలా రోజుల క్రితం నుంచే సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అనుమతుల కోసం అటవీ శాఖకు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఆ శాఖ నిబంధనల కారణంగా అనుమతులు లభించడం లేదు. దీంతో ప్రభుత్వం ఇక చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి అనుమతులు తీసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలంటూ సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసింది.

అనుమతుల సాధన కోసం ప్రత్యేక చర్యలు

అటవీ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖలతో పాటు విద్యుత్ శాఖల అధికారులు ముందస్తుగానే అటవీ శాఖకు పకడ్బందీ గా ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. అటవీ శాఖతో సమన్వయంగా వ్యవహరించి పనుల అనుమతుల కోసం ప్రయత్నాలు చేయనున్నారు. అయితే జిల్లా, రాష్ట్రస్థాయిలో అనుమతులు లభించనట్లయితే ప్రభుత్వం ద్వారా ఎన్‌జీటీని ఆశ్రయించేందుకు కూడా సంబంధిత అధికారులు సిద్ధం కానున్నారు. దీనికోసం గాను ప్రభుత్వం అనుమతి తీసుకొని చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు అభివృద్ధి పనులకు సంబంధించిన ఆవశ్యకతను, ప్రత్యామ్నాయాల వివరాలను సంబంధిత శాఖలు అందించాల్సి ఉంటుంది.

మూడేళ్ల తర్వాత నేషనల్ హైవేకు అనుమతులు

నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే నెం. 61 పనులకు గతంలో అటవీ శాఖ అనుమతులు జారీ చేయకపోవడంతో దాదాపు మూడేళ్లకు పైగా పనులు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. ఆ తర్వాత సంబంధిత అధికారులు చేసిన ప్రయత్నాల కారణంగా ఈ రోడ్డు పనులకు కొన్ని షరతులు విధిస్తూ ఎన్‌జీటీ అనుమతు లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో జిల్లాలో చేపట్టదలచిన అన్ని రకాల అభివృద్ధి పనులకు కూడా అటవీ శాఖ నుండి అనుమతుల జారీ విషయంలో అభ్యంతరాలు తలెత్తితే ఇక చెన్నైలోని ఎన్‌జీటీని ఆశ్రయించేందుకు సిద్ధం కావాలని నిర్ణయించారు.

మారుమూల గ్రామాల పరిస్థితి అధోగతి

జిల్లాలోని పెంబి, కడెం, దస్తురాబాద్, మామడ, ఖానాపూర్ తదితర మండలాల్లోని అనేక మారుమూల గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. పెంబి మండలంలోని పోచంపల్లి, పెద రాగి దుబ్బ, గోధుమల గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్ ఫేస్ కరెంటు సౌకర్యం కూడా లేకపోవడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. అలాగే ఇదే మండలంలోని జీడిమల్ల తండా, గోరి పెద్దయ్య గూడెం, కోరుకంటి, పూసగుట్ట, రాగిగూడ, జంగుగూడ, సాకిగూడ, రామగూడ, కొత్తగూడ, ఇస్లాపూర్, కడెం మండలంలోని గండి గోపాల్‌పూర్, ఇస్లాంపూర్, మీది చింత గ్రామాలకు అటవీ శాఖ అనుమతులు లభించకపోతుండడంతో ఇప్పటికీ త్రీఫేస్ కరెంటు సౌకర్యం కల్పించలేకపోతున్నారు. అలాగే అనేక గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేకపోతున్నారు. రోడ్డు నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోతుండడం ఈ మారుమూల పల్లె ప్రజలకు శాపంగా మారుతుంది. గతంలో అధికారులు పెంబి మండలంలోని రాంనగర్, దొందరి, వట్టపల్లి, గుమ్మెన ఎంగ్లాపూర్, పసుపుల గ్రామాల రోడ్ల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు ఇప్పటికీ అటవీ శాఖ వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఈ గ్రామాలకు వర్షాకాలం వచ్చిందంటే దడ మొదలవుతుంది. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఈ గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ సైతం నెలల తరబడి నిలిచిపోతుండడం సహజంగా మారింది. మొన్నటి వరదలు, వర్షాల కారణంగా జిల్లాలోని అనేక మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అయితే కవ్వాల్ టైగర్ జోన్ నిబంధన ప్రకారం అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో ఈ రోడ్ల మరమ్మతులు ఇప్పటి వరకు మొదలు పెట్టలేదు. ముఖ్యంగా పెంబి మండలంలోని రాంనగర్, దొందరి, వట్టపల్లి, గుమ్మెన, ఎంగ్లాపూర్, పసుపుల తదితర గ్రామాల రోడ్ల పరిస్థితి ప్రస్తుం ద యనీయంగా ఉంది. అయితే ఇప్పటి వరకు పనులు మొదలు కాకపోవడంతో ఈ వర్షాకాలంలో సైతం ప్రస్తుతం రోడ్లపై నడవడం సాధ్యం కాదని అంటున్నారు.

మందిర నిర్మాణానికి భూమిపూజ

భైంసా రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో దత్తాత్రేయ ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులతో ఎమ్మెల్యే రామారావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి నిధులు తన హయాంలో మంజూరవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దశలవారీగా గ్రామ అభివృద్ధికి పాటుపడతానన్నారు. మంత్రికి ఉత్తం కుమార్‌రెడ్డి ఇరిగేషన్ విషయంలో తనకు సహాయ సహకారాలు అందిస్తున్నారని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ వైస్ ఎంపీపీలు నర్సారెడ్డి, రాంకిషన్ పటేల్, నాయకులు సాంప్లీ రమేష్, పండిత్ రావు పటేల్, బీజేపీ భైంసా మండల అధ్యక్షురాలు సీరం సుష్మారెడ్డి, స్థానిక నాయకులు, బీజేపీ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేదరి సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

భైంసా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో సోమవాం క్ష మహేంద్ర మేదరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెండారి ముత్తన్న, ఉపాధ్యక్షులుగా కనికరం సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా పెండారి చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శిగా కనికరం జగదీష్, కోశాధికారిగా కనికరం పోశెట్టి, కార్యవర్గ సభ్యులు పెండారి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, భోజన్న, ఉదయ్ కిరణ్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘం శ్రేణులు ఘనంగా సన్మానించి అభినందించారు. మేదారి సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- వీసీలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులతో కలిసి సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్షాకాలం కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, వరదల నష్ట నివారణ చర్యలు, వ్యవసాయం, సాగునీరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో భాగంగా సీఎం మాట్లాడుతూ... వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున దోమల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అధిక వర్షాల వల్ల సంభవించే వరదల నష్టాలు నివారించేందుకు అధికారులు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలుగకూడదన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చేనెల 14వ తేదీ వరకు అన్ని జిల్లాలలో కలెక్టర్లు, జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, శాసన సభ్యులు ప్రజలకు రేషన్ కార్డులను అందించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని చెప్పారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. రైతులకు అవసరమైన యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ యూరియా, ఇతర ఎరువుల కొరత సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు చేస్తూ ఉండాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. వర్షాకాలం కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం దోమలు, దోమల లార్వాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చునని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు అవసరమైన మందులన్నీ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లాలో మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను చేపట్టేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు పంటలకు అవసరమయ్యే సాగునీరును అందించాలని పేర్కొన్నారు. రైతులందరికీ సరిపడినంత యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను అందించాలని తెలిపారు. అన్ని ఎరువులు, మందుల దుకాణాలలో అందుబాటులో ఉన్న ఎరువులకు సంబంధించి వివరాలను ప్రదర్శించాలన్నారు. ఎరువులు పక్కదారి పడితే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. అధిక వర్షాల వల్ల అకాల వర్షాలు సంభవిస్తే వరద నష్టాలను నివారించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే జిల్లాలో విపత్తు నిర్వహణ బృందాలు(ఎన్‌డీఆర్ఎఫ్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డీఎంహెచ్‌వో రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, నీటిపారుదల శాఖ అధికారులు రవీందర్, అనిల్, గణేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడీవో అంబాజీ

ప్రాణాల మీదికి తెచ్చిన మూఢనమ్మకం

- డబ్బులు పోయాయని బియ్యం, పసుపు మిశ్రమం పంచి పెట్టిన ఓ విద్యార్థిని
- అది తినడంతో 14 మంది బాలికలకు అస్వస్థత
- పెంబి ఆశ్రమ పాఠశాలలో ఘటన

పెంబి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థిని మూఢనమ్మకంతో చేసిన నిర్వాకం వల్ల సోమవారం పలువురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినుల సమాచారం మేరకు.. పెంబి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి 6వ తరగతి వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. సోమవారం వారిలో ఓ ఆరో తరగతి ఓ విద్యార్థినికి చెందిన రూ.100 కనిపించకపోవడాన్ని సదరు బాలిక గుర్తించింది. అయితే ఎవరిని అడిగినా తమకు తెలియదని చెప్పారు. దీంతో ఆ విద్యార్థిని డబ్బులు తీసినవారిని కనుగొనడం కోసం పలువురు బాలికలకు బియ్యం, పసుపు, వేప ఆకు కలిపిన మిశ్రమాన్ని తినమని ఇచ్చింది. ఆ మిశ్రమాన్ని తిన్న 14 మంది బాలికలు కడుపు నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని గమనించిన ఆశ్రమ పాఠశాల సిబ్బంది వారిని పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. వెంటనే విషయం తెలుసుకున్న డీటీడీవో అంబాజీ పాఠశాలకు చేరుకున్నారు. పిల్లలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని విద్యార్థుల మూఢనమ్మకంతో పసుపు, బియ్యం తినడంతో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. విద్యార్థులకు మూఢనమ్మకంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులను గమనిస్తూ ఉండాలని తెలిపారు.



- సబ్ స్టేషన్‌లో చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుత్ సబ్ స్టేషన్‌ను కొల్లగొట్టిన దొంగలు

- రూ.50 లక్షల విలువైన విద్యుత్ సామగ్రి చోరీ

దిలావర్‌పూర్, జూలై 21(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుండంపల్లిలో దొంగలు రెచ్చిపోయారు. కాళేశ్వరం లిఫ్టునకు సంబంధించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కొల్లగొట్టారు. ప్రాంగణంలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని ఉన్న రాగి తీగలను, ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ దొంగతనం శుక్రవారం రాత్రి జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. పక్కనే ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని ఆంప్లిఫయర్ కూడా చోరీకి గురైనట్లు శనివారం ఉదయం బయటపడడంతో ఈ రెండు దొంగతనాలు శుక్రవారం రాత్రి జరిగి ఉంటుందంటున్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాళేశ్వరం లిఫ్టు 27వ ప్యాకేజీకి సంబంధించి 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గుండంపల్లి సమీపంలో స్టేజ్ 1 పంప్ హౌస్ వద్ద నిర్మించారు. గత ప్రభుత్వంలో ఒకసారి ట్రయల్ రన్ చేసిన అధికారులు ఆ తర్వాత వదిలేశారు. సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు సబ్ స్టేషన్‌లోని ప్రధానమైన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. అందులోని విలువైన రాగి, అల్యూమినియం తీగలను, ఆయిల్‌ను చోరీ చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ట్రాన్స్‌ఫార్మర్లను యథావిధిగా బిగించి ఉడాయించారు. దీంతో కేవలం దేవాలయంలోని రూ. 10 వేల విలువైన ఆప్లిఫయ ర్ మాత్రమే చోరీకి గురైందని గ్రామస్థులు భావించారు. కానీ ఆదివారం పంట పొలాలకు వెళ్లిన రైతులకు అక్కడక్కడా ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన వస్తువులు కనిపించడంతో అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఇరిగేషన్ ఏఈ గంగాధర్ సబ్ స్టేషన్‌ను సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను, ఆయిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించి ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. సోమవారం ఉదయం ఇరిగేషన్ ఈఈ జాదవ్ అనిల్, డీఈఈ నరేష్, ఎస్సై రవీందర్‌లు సందర్శించారు. సుమారు రూ. 45 నుంచి 50 లక్షల విలువైన సామాగ్రి చోరీకి గురైనట్లు అంచనా వేశారు.

పొలంబాటను పైలెట్ ప్రాజెక్టుగా చేపడతాం

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



సాంగ్విలో పొలంబాట పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జైనథ్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పొలంబాటను పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. సోమవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాంగ్వి గ్రామంలో పొలంబాట కింద రైతులు పంట పొలాలకు ఏర్పాటు చేసే రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే పాయలశంకర్ ద్విచక్ర వాహనం పై తిరుగుతు రైతుల సమస్యలను దగ్గరుండి అడిగి తెలుసుకున్నారు. ఈ రోడ్ల నిర్మాణానికి ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు లోక కరుణాకర్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గోడం తుమణ్, నాయకులు బోయర్ విజయ్, అశోక్‌రెడ్డి, సాయి,రాకేష్, బింగివెంకన్న,ఆశీష్‌లతో పాటు సాంగ్వి గ్రామ ప్రజలు,రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో ఖర్గే జన్మదిన వేడుకలు

ఉట్నూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు ఉట్నూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, అరకిల్ల పరమేశ్వర్‌రావు, ఉట్నూర్ మండల అధ్యక్షుడు తిగుట్ల రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ దేశానికి కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలందిస్తూ పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతు నేడు జాతీయ అధ్యక్షులుగా పార్టీకి సేవలు అందిస్తున్న గొప్ప నాయకుడు ఖర్గే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి చంద్రయ్య, సయ్యద్ ఇక్బాల్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, నిసార్, మహిళ కాంగ్రెస్ నాయకులు మేస్రం భాగ్యలక్ష్మి, బిరుదుల లాజర్, కొత్తపల్లి మహేందర్, మాజీ సర్పంచ్ జగదీశ్, అన్సారి, ఉమేష్ స్వామి, అహ్మద్, భాస్కర్ పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు ఘనసత్కారం

ఆదిలాబాద్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఐఎస్‌బీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో సర్టిఫికెట్ పొందిన రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్‌ను తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్ వన్ ఆధ్వర్యంలో సత్కరించారు. డైరెక్టర్ ను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా డిప్యూటీ సూపరిండెంట్ లుగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బండారి నరేందర్, డాక్టర్ దీపక్ పుష్కర్ లను సత్కరించారు. రిమ్స్ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని డైరెక్టర్ తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అల్లాడి రఘురాం, రమణాచారి, శ్రీకాంత్, ప్రమోద్, దయాకర్, నవీద్ మోసిన్, సచిన్, హరీశ్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల చేరిక



యూనియన్‌లో చేరిన ఆటో కార్మికులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్‌లో రిమ్స్ ఆస్పత్రి ఆటో కార్మికులు సోమవారం చేరారు. దాదాపు ముప్పై మంది యూనియన్‌లో చేరగా.. వారికి యూనియన్ అధ్యక్షులు దళిత్, ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆటోకార్మికుల సమస్యలపై యూనియన్ ద్వారా చేపడుతున్న పోరాటాలకు ఆకర్షితులై కార్మికులు చేరారని యూనియన్ నేతలు తెలిపారు. ఆటోకార్మికులకు ఎటువంటి సమస్య వచ్చినా ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని, ఆటోకాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, షహిబాజ్, ఖదీర్ ఖాన్, అజీమ్, హమీద్ పాల్గొన్నారు.

తిరుమలకు కాలినడకన జాన్సన్‌నాయక్

ఖానాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధైన తిరుమల క్షేత్రానికి బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సోమవారం కాలినడకన చేరుకున్నారు. ఆయన సతీమణి జయలక్ష్మి సహా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి జాన్సన్ నాయక్ శ్రీవారిని దర్శించుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలంతా సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని స్వామివారిని మొక్కుకున్నట్లు జాన్సన్ నాయక్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన స్వామివారి సన్నిధికి చేరుకోవడం తనకు మరువలేని అనుభూతినిచ్చిందని జాన్సన్ పేర్కొన్నారు.

మహిళలు వ్యాపారపరంగా పోటీ పడాలి



రిబ్బన్‌కట్ చేస్తున్న బి.గజానంద్ నాయక్

నార్నూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార రంగంలో మహిళలు సైతం కొత్త రకమైన దుకాణాలు పెడుతూ ఆర్థికంగా బల పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యంపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళా మగ్గం వర్క్ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిషత్‌లో ఏ పనికైన పట్టణ ప్రాంతానికి వెళ్లి సమయం వృధా చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. ఇపుడు ప్రాంత ప్రజలు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండడం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యశ్వంత్ రావు చవాన్, రూపవతి జ్ఞానోబా పుష్కర్, శివాజీ ఆడె, బాలాజీ కాంబ్లే, సురేష్ ఆడె, హరిచంద్ చవాన్, రాజు బర్కుంబే, గుంజా చిన్నయ, సంజయ్ ఆడె పాల్గొన్నారు.

బంద్ సక్సెస్



సిరికొండ మండల కేంద్రంలో మూసి ఉన్న దుకాణాలు

సిరికొండ/ఇచ్చోడ/బోథ్/గుడిహత్నూర్/నార్నూర్/తలమడుగు , జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలో చేపట్టిన బంద్ సక్సెస్ అయింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు కుమ్ర రఘురాం, కోట్నాక్ పాండు, కుమ్రం యాదవ్ రావ్, పెందూర్ మహేందర్, నాగోరావ్, తదితరులు సిరికొండలో తిరుగుతూ బంద్‌కు సహకరించాలని కోరడంతో వ్యాపార సంస్థలు, దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

ఇచ్చోడ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన 49 జీఓను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ జీవో 49ను రద్దు చేసే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, బింద్ గోండ్ తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు నైతంశేఖర్, ఆదివాసీ నాయకులు శంభు,భీం రావ్, రమేష్ పాల్గొన్నారు.

బోథ్ : బోథ్, సోనాల మండల కేంద్రాల్లో ఆదివాసీ సంఘాలు దెబ్బ ఇచ్చిన బంద్ పిలుపు విజయవంతమైంది. సోమవారం సోనాల మండల కేంద్రంలో బంద్ పూర్తి విజయమంతమైంది. బోథ్ మండల కేంద్రంలో పాక్షికంగా బంద్ కొనసాగింది. ఆర్టీసీ బస్సులు యధావిధిగా తిరిగాయి. ఆదిలాబాద్ డిపో బస్సులు మధ్యాహ్నం వరకు తిరగలేదు.

గుడిహత్నూర్ : ఆదివాసీల ఉనికి అస్తిత్వం మనుగడను దెబ్బతీసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన 49 జీవోను రద్దు చేయాల ని కోరుతూ ఆదివాసి సంఘాల ఉమ్మడి జిల్లా బంద్ పిలుపులో బాగం గా సోమవారం గుడిహత్నూర్ మండలకేంద్రంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్బంగా ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగుపటేల్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల రాజ్యాంగ పరమైన చట్టాలు హక్కులను తుంగలో తొక్కి టైగర్ కన్జర్వేషన్ రిజర్వు ప్రాజెక్టును విస్తరిస్తామనటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా ముఖ్య సలహదారుడు ఉయిక లక్ష్మణ్ , ఆదివాసి సేన విద్యార్థి జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, ఆదివాసి సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావు, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కోవ భగవన్, నాయకులు తోడసం లక్ష్మణ్ , కోట్నాక్ కేశవ్, తోడసం రమేష్, కుంరం అచ్చుంత్ రావు, మేస్రం మోహన్, సేడ్మకీ గణేష్, దుర్వ కోసేరావు తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీఓ నెంబర్.49ను వెంటనే రద్దు చేయాలని నార్నూర్, గాదిగూడ మండల ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నాడు బంద్ కొనసాగించాయి. వారికి మద్ధతుగా వ్యాపారస్తులు సైతం స్వచ్ఛందంగా బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నార్నూర్, గాదిగూడ మండల అధ్యక్షులు ఆడా శ్రీరాం, మడావి చంద్రాహరి మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన 1/70, పేసా, ఆదివాసీ చట్టాలను, ఆదివాసుల అస్తిత్వాన్ని, మనుగడను, హక్కులను జీవోలను ఉల్లంఘిస్తూ ఎటువంటి గ్రామసభ తీర్మాణాలు లేకుండానే ప్రభుత్వాలు కుమ్రం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీఓ 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్ మెస్రం, దీపక్ పెందుర్, రాము, జైవంతరావు, తానాజి పాల్గొన్నారు.

ఆదివాసులను దూరం చేస్తే సహించం..

తలమడుగు : అడవిలో పుట్టి అడవినీ నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసులను అడవి నుంచి దూరం చేస్తే సహించేది లేదని ఆదివాసి తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు కొమురు జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం ఆదివాసులనుతుడుం దెబ్బ రాష్ట బంధు పిలుపు మేరకు తలమడుగు మండలలో బందు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వము ఆదివాసులను టైగర్ కరిడార్ పేరుతో 49 జీఓను తీసుకోరావడం జరిగిందన్నారు. దీనివల్ల దాదాపు 350 ఆదివాసీ గ్రామాలు అడివి నుండి దూరం చేసే విదంగ ఉందని అన్నారు.



ఇచ్చోడలో మూసి ఉన్న దుకాణ సమదాయాలు

మండల బంధుకు సహకరించిన ప్రజలకు ధన్యవాదములు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డివిజన్ ప్రదాన కార్యదర్శి కుమ్ర జ్ఞానేశ్వర్, తలమడుగు మండల తుడుం దెబ్బ అధ్యక్షులు జంగాల పోచన్న. వార్కింగ్ ప్రెసిడెంట్ గోడం భుజంగరావు, మాజీ సర్పంచ్ పెందోర్ రఘునాథ్. మండల యువజన అధ్యక్షుడు దుర్వా .నరేందర్ ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.



తలమడుగులో బంద్ నిర్వహిస్తున్న నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

పోషకులకు అవగాహన సదస్సు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్

నిర్మల్ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక విజయ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 'పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై పోషకులకు - విద్యార్థులకు అవగాహన సదస్సు' నిర్వహించారు. ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పిల్లల భవిత తల్లిదండ్రుల బాధ్యత అనే అంశం పైన ప్రముఖ సైకాలజిస్ట్ పేరెంటింగ్ కోచ్ అడ్డిగ శ్రీనివాస్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పోషకుల ద్వారా మంచి ఆదరణ లభించిందని తెలిపారు. విద్యాభ్యాసంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో, విజయానికి ఎలా సులువైన బాటలు వేసుకోవాలో, తల్లిదండ్రులు మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల ఆలోచన దృక్పథానికి ఎలా స్పందించాలో వారితో ఎలా మెలగాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల జనరల్ సెక్రటరీ, డిస్ట్రిక్ట్ ఒలంపిక్ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ... పిల్లలు, పోషకులు, సైకాలజిస్ట్ చెప్పినటువంటి మంచి విషయాలను పాటించాలన్నారు. కార్యక్రమానికి పాఠశాల వైస్‌చైర్మన్ అంబారాణి, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ ఆమెడ కిషన్, పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య

ఇంద్రవెల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో యువకుడు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గౌరపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని చిత్తబట్ట గ్రామంలో జరిగింది. ఎస్సై ఇసాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చిత్తబట్ట గ్రామానికి చెందిన చహకటి గంగారాం, భుంబాయి దంపతులకు సోము, శంకర్, గణేష్ (19) క్రిష్ణ నలుగురు సంతానం. సోము, శంకర్‌ల పెళ్ళిలు కావడంతో ఇతర గ్రామాల్లో నివాసముంటున్నారు. ప్రస్తుతం గణేష్ ఇంటి పెద్దగా ఉంటూ అన్ని పనుల్లో తల్లిదండ్రులకు సహకరిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి ఇంట్లో పనులు మానేసి బయట తిరుగుతున్నాడు. తేది 20న ఉదయం పని చేయకుండా ఎటు తిరుగుతున్నావు అంటూ తండ్రి గంగారాం మందలించి తన భార్యతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. తండ్రి మందలించడంతో క్షణికావేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు గణేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. తిరిగి వ్యవసాయ పనులు ముగించు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తమ కొడుకు ఉరి వేసుకుని విఘతజీవిగా ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం ఉదయం చిత్తబట్ట గ్రామాన్ని సందర్శించి యువకుడు ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● 8 తులాల బంగారు, 30 తులాల వెండి, నగదు అపహరణ



దొంగలు పగులకొట్టిన బీరువా

భైంసా, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రాహుల్‌నగర్ కాలనీ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి వేళలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగింది. కాలనీ పరిధిలో అద్దెకుంటున్న కుబీర్ మండల కేంద్రవాసి సాగర స్రామాట్ ఇంట్లో ఘటన చోటు చేసుకుంది. తాళం పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు పడక గదిలోని బీరువా, డ్రెస్సింగ్ టెబుళ్లను పగుల కొట్టి చోరికి తెగబడ్డారు. బాధితుడు సాగర స్రామాట్ తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.... ఆదివారం అర్ధరాత్రి వేళలో సాగర స్రామాట్ కుమారుడు అనారోగ్యంతో అస్వస్థత చెందగా పట్టణ పరిధిలోని డాక్టర్స్‌లేన్ మార్గంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులందరూ ఇంటికి తాళం వేసి ఆసుపత్రి వెళ్లి తిరిగివచ్చిన రెండున్నర గంటల వ్యవధిలో ఘటన చోటు చేసుకుంది. దొంగలు తాళాన్ని పగుల కొట్టి ఇంట్లోకి చొరబడి అక్కడి బీరువా, డ్రెస్సింగ్ టేబుళ్లను పగులకొట్టి 8 తులాల బంగారు ,30 తులాల వెండి అభరణాలతో పాటు రూ.50 వేల నగదును అపహరించుకొని ఉడాయించారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన బాధితుడు తాళం పగులకొట్టి ఉండటం చూసి చోరీ జరిగినట్లుగా గుర్తించారు. సంబంధిత ఘటనపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం చోరీ ఘటన చోటు చేసుకున్న ఇంట్లో వేలి ముద్రలను సేకరించింది.

స్థానిక ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

జైనథ్, జూలై21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌ల స్థానిక ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం అన్నారు. సోమవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాలలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల పై నాయకులు కార్యకర్తలకు వర్క్‌షాప్ పై నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ పార్టీ బలపరిచిన వ్యక్తికి బూత్ స్థాయి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సీ మోర్చ జిల్లా అధ్యక్షులు అస్తక్‌సుభాష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పోతరాజు రమేష్, నాయకులు తిరుపతి, సంతోష్, శ్యాంరావ్, లింగారెడ్డి, మహేందర్, రోహిదాస్‌లతో పాటు ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్ అడవుల్లో.. అలజడి

(5వ పేజీ తరువాయి...)

అధికారులు పోడు సాగును అడ్డుకోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. అసలు గిరిజనేతర రైతులకు అటవీ భూములను ఇవ్వడం సాధ్యపడదని తెలిసినా కొంత మంది రైతులు పోడు భూములను సాగు చేసుకోవడం వివాదాస్పదంగా మారింది.

పోలీసుల అదుపులో దాడి నిందితులు?

కేశవపట్నం ఘటనలో అధికారులపై దాడికి దిగిన పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. నిందితులను అదుపులోకి తీసుకున్న విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. సోమవారం తెల్లవారు జామున పలువురు నిందితులను అదుపులోకి తీసుకుని ఇతర మండలాల పోలీసు స్టేషన్లకు తరలించి రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. అసలు దాడి ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. దాడి చేసిన సమయంలో తీసిన వీడియో రికార్డుల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారన్న టాక్ వినిపిస్తుంది. నేడో రేపో దాడి ఘటన కేసులో పలువురు నిందితులను మీడియా ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రతీసారి ముల్తానీల వ్యవహారం జిల్లా పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.

కేజీబీవీలో అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

నార్నూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని కేజీబీవీలో పీజీసీఆర్టీ అతిథి అధ్యాపకులుగా ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుగా ఎస్ఓ ఆర్.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులు పీజీ, బీఎడ్ తప్పనిసరిగా అర్హత ఉండాలని తెలిపారు. పోస్టుల వివరాలు ఇంగ్లీష్ ఫిజిక్స్ కెమిస్ట్రీ బాట్నీ, జువాలజీ ఇట్టి పోస్టులకు 25వ తేదీలోపు దరఖాస్తు కార్యాలయానికి సమర్పించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సారంగాపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల క్రితం ఉడుత బమేష్ అప్పుల బాధ భరించలేక పురుగులు మందు తాగి మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను సోమవారం సారంగాపూర్ గ్రామానికి చెందిన యువకులు రూ. 20వేలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ ఆర్థిక సహాయం కార్యక్రమంలో సత్యం, దొడ నరేష్, గంగేష్, జిట్టా భోజన్న, దినేష్, ఆశన్న, సాయికిరణ్, రూపేష్, సామల సాయిలు ఉన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి

పెంబి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళికలతో స్థానిక ఎన్నికలపై ముందుకు సాగాలని పెంబి మండల ప్రబారి నల్ల రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. మండలాల్లో జడ్పీటీసీలు గెలిచి జిల్లాలో జిల్లా చైర్మన్‌ను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, బీజేపీ నాయకులు నగేష్, శ్రీనివాస్, నాగరాజు, మహేష్, రవి, రాజేందర్, రాజబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

భైంసా రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి దొంతుల గణేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుబీర్ గ్రామానికి చెందిన దొంతుల గణేష్(45) ఆర్మీ విధులు నిర్వహించేవాడు. గత కొన్ని రోజుల క్రితమే ఆర్మీ నుండి రిటైర్డ్ అయ్యాడు. సోమవారం ఉదయం సమయంలో కూతురు నిఖిలను హైదరాబాద్‌లోని ప్రైవేట్ స్కూల్‌కు తీసుకువెళ్లడానికి ఉదయం కుబీర్ నుండి బాసర రైల్వే స్టేషన్‌కు మోటార్ సైకిల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వెళ్లగా మార్గమధ్యలో దేగాం గ్రామంలోని సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి బ్రిడ్జి నుండి కింద పడిపోవడంతో గణేష్ తీవ్రమైన రక్తపు గాయాలు అయి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. కూతురు నిఖిలకు తీవ్ర గాయాలు పాలైంది. స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో భైంసా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది.

అందకూర్ చెరువులో మృతదేహం లభ్యం

కుంటాల, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందకూర్ చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన స్థానికులు కాలకృత్యాల కొరకు చెరువులో వెళ్లిన సమయంలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి రూరల్ సీఐ నైలు, క్లూస్ టీం బాలాజీ, మన్సూర్‌లతో పాటు ఎస్ఐ అశోక్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇతను రెండు నెలల క్రితం మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహం గుర్తుపట్టలేని పరిస్థితిలో అస్థికలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూకర్ జీన్ ప్యాంటు, ఆకు పచ్చని తెల్ల గీతల షర్టు ఉందని, మృతదేహాన్ని అక్కడ ఖననం చేయడం జరిగిందని తెలిపారు.

ముథోల్‌లో చోరీ

ముథోల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని సాయి మాధవ్ నగర్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం సాయినాథ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... సాయినాథ్ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వేరే గ్రామానికి వెళ్లారు. అయితే మధ్యాహ్నం వేళలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగలించారు. మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చిచూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగినట్లు విషయాన్ని గ్రహించి ముథోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్‌లు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బంగారు గొలుసు విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితులకు చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న బోథ్ ఆత్మ చైర్మన్

బోథ్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని సోనుపల్లి గ్రామానికి చెందిన సిండే సౌజన్య అనారోగ్యం బారిన పడింది. విషయం తెలుసుకున్న బోథ్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ వైద్యం నిమిత్తం ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జుకు విన్నవించడంతో స్పందించి 3 లక్షల ఇరవై వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఇప్పించడం జరిగింది. దీంతో మంజూరు అయిన చెక్కును ఆత్మ చైర్మన్ చేతుల మీదుగా అందించారు. తన ఆర్థిక పరిస్థితి దృశ్య నిధులు మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు బోథ్ ఆత్మ చైర్మన్‌లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రైట్.. రైట్..



భైంసా - నిర్మల్ జాతీయ రహదారి మార్గం

- నిర్మల్ - భైంసా జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం అమోద ముద్ర
- నాలుగు లైన్ల ఏర్పాటు కోసం డీపీఆర్ రూపొందించాలని ఆదేశం
- తీరనున్న ట్రాఫిక్ ఇబ్బందులు, మెరుగు కానున్న రవాణాసౌకర్యం

భైంసా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిర్మల్ - భైంసా వరకు గల జాతీయ రహదారి - 61 విస్తరణకు నోచుకోనుంది. రెండు లైన్లతో కూడిన సంబంధిత జాతీయ రహదారి మార్గం నాలుగు లైన్లకు విస్తరించనుంది. ఇందుకు సంబంధించి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అమోద ముద్ర వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రోడ్డు విస్తరణకు సంబంధించి డిటేయిల్ ప్రాజెక్టు సిద్ధం చేసి నివేదిస్తే విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించనుంది. రాష్ట్రంలో మొత్తం 15 జాతీయ రహదారి మార్గాలను రూ.33,690 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం విస్తరించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో నిర్మల్ - భైంసా వరకు గల జాతీయ రహదారి 61కు చోటు దక్కింది. 2027-28 ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు విస్తరణలు పూర్తి చేసే దిశగా కార్యచరణ ప్రణాళిక రూ పొందించారు.

● 53 కిలో మీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ

నిర్మల్ - భైంసా వరకు గల జాతీయ రహదారి మార్గంలో 53 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ జరుగనుంది. ప్రస్తుతం రెండు లైన్లతో కూడిన సంబంధిత రోడ్డు నాలుగు లైన్లకు విస్తరించనుంది. కళ్యాణి నుంచి నిర్మల్ వరకు జాతీయ రహదారి మార్గంలోని 615 కిలో మీటర్ నుంచి 668వ కిలో మీటర్ వరకు రోడ్డు విస్తరణకు నోచుకోనుంది.

● మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ

జాతీయ రహదారి మార్గంలో వాహన రద్దీ పెరుగుతుండటం, మున్ముందు మరింతగా ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం విస్తరణపై దృష్టి సారించింది. దీనికి తోడు నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావ్ పాటిల్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గెడం నగేష్‌లు ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కారిని కలిసి రోడ్డు విస్తరణ అవశ్యకతను వివరించారు. ఇందుకు స్పందించిన కేంద్ర మంత్రి రాష్ట్రంలో చేపట్టే జాతీయ రహదారి విస్తరించే మార్గాల్లో నిర్మల్ - భైంసాను చేర్చడం జరిగినట్లుగా తెలిసింది. బీజేపీ ఎమ్మెల్యేల చొరవ, ప్రయత్నం మూలంగాను రోడ్డు విస్తరణకు అమోద ముద్ర లభించినట్లుగా సమాచారం. రోడ్డు విస్తరణకు నోచుకుంటుండటంతో జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుకానుంది. ట్రాఫిక్ సమస్యలు తొలగిపోనున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ

- ఆశావహుల్లో అయోమయం
- మారనున్న రిజర్వేషన్లు..?
- పది మంది కలిస్తే చాలు పంచాయతీ ఎన్నికలపై చర్చ



ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ముథోల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. ఈ సందర్భంగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచేందుకు సంసిద్ధం కాగా గ్రామాల్లో ఈ సారి రిజర్వేషన్లు మారుతాయని అనుకూలిస్తే పోటీ చేస్తామని చర్చ జరుగుతుం ది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత, తాజా మాజీలు కసరత్తు చేస్తున్నారని చెప్పుకోవచ్చు. ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేసి ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తుందోనని ముథోల్ నియోజకవర్గంలోని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ వారీగా ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు ఓటరు లిస్ట్ నివేదికను సిద్ధం చేసింది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఆశావాహులు తమ కసరత్తును మొదలుపెట్టారు. ఈ సారి ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్ని కల్లో పో టీ చేస్తామంటూ కొందరు నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సర్పంచ్‌గా బరిలో నిలిచేందుకు నాయకులు ఇప్పటి నుంచి పావులు కదుపుతున్నట్లు సమాచారం. తమ కుల సంఘాలకు కొందరు నాయకులు ఇప్పటి నుంచే మాట చేరవేస్తున్నా రు. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలిస్తే నేను పోటీ చేస్తాను మీ మద్దతు మాకే కావాలంటూ గుసగుసలు మొదలయ్యాయి. ఈసారి అధిక సంఖ్యలో ఆ యా గ్రామాల్లో యువత పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తాను చాటేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే ముథోల్ ని యోజకవర్గం ఎమ్మెల్యే బీజేపీ నుంచి గెలుపొందాడు. అయితే ఈసారి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాగైనా తమ పార్టీ నుంచి అధిక సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. తమ పార్టీయే రాష్ట్రంలో అధికారంలో ఉంది. కాబట్టి దాదాపు అన్ని స్థానాల్లో గెలుపు మాదే ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికీ రిజర్వేషన్లు ఖరారై స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే పల్లెల్లో స్థానిక ఎన్నికల సమరం రసవత్తరంగా జరుగనుంది. ఈసారి పోటీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌గా పోటీ చేస్తాం. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి అంటూ కొందరు ఆశావహులు సోషల్ మీడియాలో తెలుపుతున్నారు. ఏది ఏమైనా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నోటిఫికేషన్ రాకముందే ఆశావహులు తమ కసరత్తును మొదలు పెట్టారని చెప్పుకోవచ్చు. నియోజకవర్గంలోని ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం, భైంసా, కుంటాల, కుబీర్ మండలాలు కలిపి మొత్తం 173 గ్రామ పంచాయతీలు, 237 గ్రామాలు ఉన్నాయి. అయితే త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో యువతనే ఎక్కువ శాతం బరిలో దిగేందుకు ఆసక్తి చూపనున్నట్లు తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లో అయితే నాయకులు ఇప్పటి నుంచే ఓట్లు ఆకర్షించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గుమిగూడి పది మంది ఉన్న చోట నాయకులు వెళ్లి వారిని పలకరించడం చేస్తున్నారు. ఈసారి అవకాశం వస్తే పోటీ చేస్తానంటూ కాక అని అన్న, తమ్ముడు అంటూ వరుసలు పెట్టి పలకరిస్తున్నారు. మన గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, గ్రామం రూపురేఖలు మారుస్తానని చెబుతున్నారు.

పిల్లలకు ఆధార్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటాం

● నార్నూర్ ఎంపీవో సాయి ప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నార్నూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన కొలాం పిల్లలకు ఆధార్ లేదు.. బడిలో అడ్మిషన్ లేదు అనే వార్త సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మైంది. ఈ మేరకు నార్నూర్ ఎంపీడీవో కార్యాల యం అధికారి ఎంపీవో సాయిప్రసాద్ స్పందించారు. మండలంలోని తడిహత్నూరు గ్రామ పంచాయతీ ముక్తాపూర్ గ్రామం వద్ద ఉన్న ఆధార్ కార్డు లేని పిల్లల ఎంత మంది ఉన్నారు అనేది పూర్తి వివరాలు సేకరించి ముందుగా వారికి గ్రామ పంచాయతీ నుంచి జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఆధార్‌కార్డు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జీవో49ని వెంటనే రద్దు చేయాలి



భీంపూర్‌లో నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

భీంపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన చట్టం 49 జీవోను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రం భీంపూర్‌లో సోమవారం ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల ప్రతినిధులు మడావి పాండురంగ్, సీడం పురుషోత్తం, మడావి లింబాజి, కుడి మేత సంతోష్, మడావి వినోద్‌లు మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను, సంస్కృతి సంప్రదాయాలను, ఆదివాసి హక్కుల ఉల్లంఘిస్తూ ఎటువంటి గ్రామ సభలు, తీర్మానాలు లేకుండానే కొమురం భీం కారిడార్ పేరిట తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ బంద్‌లో ఆదివాసీ నాయకులు సిడం అశోక్, మడావి నాగోరావ్, రాయిసీడం మాణిక్ రావు, సూర్య కాంతరావు, దుర్వ శంకర్, సీడం కేశవ్, మరసకోల వైద్యనాథ్, ఆత్రం రామేశ్వర్‌లు పాల్గొన్నారు.

25న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వియోగించుకోండి



జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న ఉట్నూర్‌లోని జేసీఎన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న జాబు మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులు గుడాల అనిష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు వారు ఉద్యోగమేలాకు సంబంధించిన కరపత్రాలను సోనాలలో విడుదల చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాత్రం సుగుణక్క ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ప్రవీణ్, రామ్ లక్ష్మణ్, మహేష్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



సంధ్యారాణి, సిరికొండ కేజీబీవీ ప్రత్యేక అధికారిణి

సిరికొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో అతిథిగా అధ్యాపకుల భర్తీకి ఆసక్తి కల్గిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పీజీసీఆర్టీ ఇంగ్లీష్, కెమిస్ట్రీ, బాటనీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు సంబంధిత సబ్జెక్టుల లో పీజీ, బి.ఎడ్ అర్హత కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈనెల 22వ తేదీ నుంచి 25వ తారీఖు వరకు మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను సిరికొండ కేజీబీవీలో సమర్పించాలని ఆమె కోరారు.

పని చేసినా.. పైసల్ రాలే

● కుల గణన డాటా ఎంట్రీ చేసిన బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు అందని డబ్బులు



బాసర ఆర్జీయూకేటీ క్యాంపస్

బాసర, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో కుల గణన చేపట్టింది. నిర్మల్ జిల్లాకు సంబంధించి సుమారు రెండు లక్షల దరఖాస్తులను బాసర ఆర్జీయూకేటి విద్యార్థులకు డాటా ఎంట్రీ బాధ్యతలను అప్పగించారు. ప్రతీ విద్యార్థి దగ్గర ల్యాప్‌టాప్ ఉండటంతో ఈ ప్రక్రియ సులువవుతుందని జిల్లా అధికారులు భావించారు. యూనివర్సిటి అధికారులు ఆసక్తి ఉన్న విద్యార్థులచే డాటా ఎంట్రీ చేయించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా ఖాళీగా ఉండే సమయంలో ప్రతీ రోజు గంట సేపు విద్యార్థులు ఈ సమయం కేటాయించి కుల గణనలో వచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. నిర్మల్ జిల్లాలో రెండు మండలాలు మినహా అన్ని మండలాలు, మూడు మున్సిపాల్టీలకు సంబంధించిన దరఖాస్తులకు సంబంధించిన ఆన్‌లైన్ పని అంతా ట్రిపుల్ ఐటి విద్యార్థులే చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా కుల గణన దరఖాస్తు డాటా ఎంట్రికి ఒక్కో దరఖాస్తుకు రూ. 30 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన సుమారు రెండు లక్షల దరఖాస్తులు నమోదు చేసిన విద్యార్థులకు రూ.లక్షల్లో ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. విద్యార్థుల నుంచి బ్యాంకు అకౌంట్ నెంబర్‌లను కూడా అధికారులు తీసుకున్నారు. నెలలు గడుస్తున్న ఇప్పటికి ఒక్క పైసా రాలేదు. ట్రిపుల్ ఐటిలో చదివే నిరుపేద విద్యాఉర్థులు చదువుల అవసరాల కోసం ఎంతో కొంత వస్తుందని భావించిన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ డాటా ఎంట్రి బాధ్యతలను తీసుకున్న యూనివర్సిటి అధికారి రాకేశ్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని చెప్పారు. విద్యార్థుల అకౌంట్ నెంబర్‌లు ఇచ్చామని నిధులు విడుదలైతే.. విద్యార్థుల అకౌంట్‌లోనే డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.

భారీ వర్షం - రైతన్నల హర్షం

- తడిసి ముద్దయిన భైంసా
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రాకపోకలకు ఇబ్బందులు



భైంసాలోని అంతర్గత రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

భైంసా, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం వేళ నుంచి భారీ వర్షం కురిసింది. వరుణుడి కరుణ లేక వాడిపోతున్న పైర్లను చూస్తూ కాలం గడుపుతున్న రైతన్నలు భారీ వర్షంతో హర్షం చెందారు. ఏకదాటిగా కురిసిన వర్షంతో దెబ్బతింటున్న పంటల పైర్లకు జీవం పోసినట్లయింది. గత పక్షం రోజులకు పైగా కాలం నుంచి ఇక్కడి ప్రాంతంలో చెప్పుకోతగ్గ రీతిలో వర్షం కురియలేదు. పై పెచ్చు వేసవిని తలపించేలా ఎండల తీవ్రత అధికమవ్వడంతో సాగులోనున్న వివిధ పంటల పైర్లు వాడి చూపాయి. దీంతో రైతులంతా వరుణుడి కరుణ కోసం గాను పూజలు చేయడం, అన్నదానాలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. వారి మొరను ఆలకించినట్లుగా సోమవారం మ ధ్యాహ్నం 3 గంటల నుంచి ఇక్కడి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలలో వర్షపు నీరు నిలిచింది.

● జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఏకదాటిగా కురిసిన భారీ వర్షంతో భైంసా పట్టణం తడిసి ముద్దయింది.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు చిన్నపాటి చెరువులను, కుంటలను తలపించాయి. మురికి కాలువలు పొంగి ప్రవహించడంతో పలు ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు ఉదృతితో ప్రవహించడం మూలంగా మురికి కాలువల్లోని పూడిక, వ్యర్థాలు, చెత్త,చెదారం రోడ్లపై పేరుకపోయి పరిస్థితి అధ్వాన్న స్థితికి చేరుకుంది. వారంతపు సంతలోని వ్యాపారులు తమ సరుకులు తడిసి పోకుండా ఉండేందుకు, వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకపోకుండా కాపాండేందుకు గాను పడరాని పాట్లు పడ్డారు.



భైంసాలోని లోతట్టు వ్యవసాయ క్షేత్రాల్లో నిలిచిన వర్షపు నీరు

ముథోల్‌లో కురిసిన వర్షం.. మురిసిన రైతు

ముథోల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం వేళలో మోస్తారు వర్షం కురిసింది. దీంతో రైతన్న లు మురిసిపోయారు. సుమారు 20 రోజుల నుంచి వర్షం కురియకపోవడం తో మొలచిన పంట మొలకలు వాడు చూపుతున్న నేపథ్యంలో రైతన్న ఆం దోళనకు గురయ్యారు. ప్రతిరోజు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూశా రు. అయితే సోమవారం కురిసిన వర్షం కొంతమట్టుకు రైతులకు ఊరటని కలిగించింది. వాడు చూపుతున్న మొక్కలకు ఈ వర్షం మేలు చేసినట్లయితే దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

కదిలిలో నాగ సాధువుల సందడి



నందీశ్వరుడి వద్ద నాగ సాధువులు



కోతికి అరటి పండును ఇస్తున్న సాధువు

దిలావర్‌పూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ మాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నాగ సాధువులు సందడి చేశారు. మూడు వాహనాల్లో పది మంది సాదువులు తెల్లవారు జామున ఆలయానికి చేరుకున్నారు. పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోనే కూర్చొని పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు నుదుటన విభూది రాస్తూ ఆశీర్వదించారు. భక్తులు ఇచ్చే నగదును స్వీకరించారు. అన్నదాన సత్రంలో భక్తులతో పాటు భోజనం చేసి తిరిగి వెళ్లిపోయారు.

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత

● ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ



బరంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, కుటుంబ సభ్యులు

తలమడుగు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక మార్గంతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వై. హిమశ్రీ అన్నారు. సోమవారం తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా స్వామి వెలిసిన కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వై హిమశ్రీ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఆధ్యాత్మిక మార్గంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. బరంపూర్ తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం వల్ల చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లా అధికారిని ఘనంగా సన్మానించారు. ఇందులో ఎక్సైజ్ శాఖ సిఐ విజయేందర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ముగిసిన సామూహిక లింగాష్టక పారాయణం




సోనాల శివాలయం వద్ద లింగాష్టక పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆలయంలో గత మార్చి మూడవ తేదీ నుంచి ప్రారంభించిన సామూహిక లింగాష్టక పారాయణం నేటితో ముగిసింది. 21 వారాల పాటు కమిటీ సభ్యులు భక్తులతో కలిసి లింగాష్టగా పారాయణాన్ని గావించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని తుల కవిత సదానందంల ఆధ్వర్యంలో భావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు చి లుకూరి నరేందర్, పసుపు నోటి గంగాధర్, మామిల్ల రవి, పాడారి రమేష్‌లతో పాటు భక్తులు కడారి రమేష్‌లతో భక్తులు పాల్గొన్నారు.

కవ్వాల్ అడవుల్లో.. అలజడి

...అక్రమ పోడు సాగును అడ్డుకుంటున్న అధికారులు



● సిరిచెల్మ రేంజ్ పరిధిలో సాగు చేస్తున్న పోడు భూములు ఇవే..

- సిరిచెల్మ రేంజ్ పరిధిలో 26 వేల హెక్టార్ల అటవీ భూములు మాయం
- రాళ్ల దాడి ఘటనతో పోలీసు, అధికార వర్గాల్లో అలజడి
- గతంలోనూ పలుమార్లు అటవీ శాఖ అధికారులపై దాడులు
- ప్రత్యామ్నాయంగా ఉపాధిని చూపేందుకు అధికారుల హామీ
- పోలీసులకే పెద్ద సవాల్‌గా మారిన ముల్తానీల వ్యవహారం

జిల్లాలోని కవ్వాల్ అడవుల్లో.. అక్రమ పోడు సాగు అలజడి రేపుతోంది. హద్దులు దాటి అటవీ భూముల్లో పంటలను సాగు చేయవద్దని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా.. ఫలితం లేకుండా పోతోంది. యేటా వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పోడు భూముల వివాదం తెరపైకి వస్తుంది. ఇటీవల సిరిచెల్మ రేంజ్ పరిధిలోని పోడు భూముల్లో పంటల సాగును అడ్డుకునే ప్రయత్నం చేసిన అధికారులపై తిరుగుబాటు చేసి ముల్తానీలు రాళ్లదాడి చేయడం జిల్లాలో కలకలం రేపుతోంది. పలు మండలాల్లోను పోడు భూముల సమస్యతో రైతులు సతమతమవుతున్నారు. పోలీసుల సహాయంతో కేశవపట్నం గ్రామ పరిధిలో పోడు సాగును అడ్డుకోగా.. అధికారులపై దాడికి దిగడం వివాదాస్పదంగా మారింది.

ఆదిలాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏళ్ల గడుస్తున్నా పోడు సమస్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో అటవీ శాఖ అధికారులు, పోడు రైతుల మధ్య తరుచూ వివాదాలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పోడు రైతులు ఆగ్రహించి అధికారులపై భౌతిక దాడులకు దిగడం ఆందోళన రేపుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నామమాత్రంగానే పోడు పట్టాలను పంపిణీ చేయడంతో పోడు సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపినట్లు కనిపించడం లేదు. గిరిజన రైతులతో పాటు గిరిజనేతర రైతులు కూడా పోడు భూములను సాగు చేసుకోవడం పెద్ద సమస్యగా మారింది.

మైదానాలుగా మారుతున్న అడవులు

కలప స్మగ్లర్ల ఆగడాలకు దట్టమైన కవ్వాల్ అడవులు మైదాన ప్రాంతాలుగా మారుతున్నాయి. సిరిచెల్మ రేంజ్ పరిధిలో మొత్తం 58 వేల హెక్టార్ల అటవీ భూమి ఉంది. ఇందులో దాదాపుగా 26 వేల హెక్టార్ల భూమిని అక్రమంగా పోడు సాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూముల్లో మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిసారి స్థానిక ముల్తానీలతో వివాదం తలెత్తుతూనే ఉంది. గతేడు కూడా అధికారులపై తిరుగుబాటు చేయడంతో వెనకడుగు వేయాల్సి వచ్చింది. ఈసారి పోలీసుల సహాయం తో ప్లాంటేషన్ చేసేందుకు ప్రయత్నించినా.. ఫలితం లేకుండా పోయింది. ముఖ్యంగా కేశవపట్నం, గుండాల, ఎల్లమ్మగూడ, బాబ్జిపేట, సిరిచెల్మ గ్రామాల పరిధిలో 3వేల హెక్టార్ల భూమిని ఆక్రమించుకొని పంటలను సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పోడు రైతుల చేతుల్లోకి వెళ్లి పోయినా అటవి భూములను తిరిగి తీసుకునేందుకు అటవీ శాఖ అధికారులు ముప్పుతిప్పలు పడాల్సి వస్తుంది.



పలువురిపై పీడీ యాక్ట్ కేసులు

కవ్వాల్ అభయారణ్యంలో అడ్డగోలుగా అడవులను నరకడం.. ఆపైగా పోడు వ్యవసాయం చేయడం పరిపాటిగా మారింది. గతంలో అక్రమ కలప రవాణా, అధికారులపై దాడులకు పాల్పడిన పలువురు నిందితుల పై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇప్పటికే ఇద్దరు నిందితుల పై పీడీ యాక్ట్ కేసులను కూడా నమోదు చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా పీడీ యాక్ట్ కేసు ఇచ్చోడ మండలంలో నమోదు కావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కొంత వెనకడుగు వేసిన స్మగ్లర్లు మళ్లీ అధికారులపై దాడులతో రెచ్చిపోవడం వివాదస్పదంగా మారింది. కొంత మంది నేతల ఓటు బ్యాంకు రాజకీయాలతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి పరోక్షంగా నేతలు మద్దతునిస్తున్నట్లు తెలుస్తుంది. వాస్తవ విషయాలను పక్కనపెట్టి అమాయకులను అధికారులపై ఉసిగొల్పడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

సంఘటన జరిగినప్పుడే హడావిడి

ఏదైనా సంఘటన జరిగినప్పుడే అధికారులు హడావిడి చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలోను ఇలాంటి దాడి సంఘటనలు జరిగిన శాశ్వత పరిష్కారం చూపలేదంటున్నారు. కలప స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యామ్నాయంగా ముల్తానీలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామని జిల్లా అధికారులు హామీలు ఇచ్చారు. దీనిపై ఏకంగా అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించారు. కాని ఇప్పటి వరకు హామీలను అమలు చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో అటవీ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నా ముల్తానీలకు పంటల సాగే ప్రధాన వృత్తిగా మారింది. ఇప్పటికే వందలాది ఎకరాలలో పంటలను సాగు చేస్తున్నారు. ఇలాంటి క్రమంలో

(తరువాయి 6వ పేజీలో....)



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

సీఎం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో పాటు అధికారులు పాల్గొన్నారు. నీటిపారుదల, వ్యవసాయ రంగం, విత్తనాల పంపిణీ, భారీ వర్షాల ప్రభావం, ఆరోగ్య సవాళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం అన్ని శాఖలు సమన్వయంగా పని చేస్తూ రైతులకు, పౌరులకు అవసరమైన సేవలు సమర్థవంతంగా అందించేందుకు జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని, యూరియాకు సంబంధించి సలహాలు సూచనలకు సెల్ నెం. 8977741771 కాల్ చేయవచ్చని తెలిపారు. ప్రతీరోజు వ్యవసాయ శాఖకు సంబంధించి స్టాక్ వివరాలు నమోదు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ స్థానిక రైతువేదికల్లో, బస్టాండ్, కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. వర్షాల ప్రభావంతో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, మండలానికి ఒక అధికారిని నియమించాలన్నారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులలో నీటి శాతం వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సీజనల్ వ్యాదులు ప్రబలకుండా వైద్యాధికారులను అప్రమత్తం చేయాలన్నారు. డాక్టర్లు, మదులు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో ఆశావర్కర్‌లు ఇంటింటికి వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, సబ్ కలెక్టర్ యువరాజ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి: ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): బాధితులు అందించే వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం స్థానిక పోలిసు ముఖ్య కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. 26 మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించగా.. వాటిని సావధానంగా ఆలకించి సంబంధిత పోలిసు అధికారులకు సమస్యల పరిష్కారంపై సూచనలు చేశారు. భూ సమస్యలలో కుటుంబ సభ్యుల మోసం, నకిలీ రిజిస్ట్రేషన్‌లు, డబల్ రిజిస్ట్రేషన్‌లతో మోసం చేసే వ్యక్తులపై ఫిర్యాదులు అందాయని, వాటిపై సరైన ఆధారాలతో కేసులను నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సూచించారు. సుదూర ప్రాంతాల వారు వాట్సాప్ ద్వార సమాచారం అందించాలన్నా, ఫిర్యాదు చేయలన్నా.. 8712659973 నెంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల నర్సయ్య

ఆదిలాబాద్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో సరైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు పోటీ పరిక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచేలా తగు చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమైన ఆయన లైబ్రేరియన్ సతీష్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, టీఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్‌తో పాటు పలువురు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరించారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నేతలు సంజీవ్ రెడ్డి, అంబకంటి అశోక్ తదితరులు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరు కావడంతో ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం మధ్యలోనే అసహనం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది.

కేజీబీవీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయంలోని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న 20 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారిని జి.మల్లిక ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బాలికలు బుధవారం రోజు ఒరిజనల్ సర్టిఫికేట్లు వెంట తీసుకుని ఇచ్చోడ కేజీబీవీ పాఠశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగించకోవాలని సూచించారు. మిగితా వివరాలకు సెల్ నెం. 8008301996 ద్వారా సంప్రదించాలని కొరారు.

'జీవో 49 ఆగుతుంది.. ఆందోళన వద్దు'

ఉట్నూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నివసిస్తున్న ప్రజల్లో పెద్దఎత్తున ఆందోళన కలిగిస్తున్న జీవో 49 ఆగుతుందని, జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అన్నారు. సోమవారం రాష్ట్ర రాజధానిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జీవో 49ని రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవో విడుదలతో ఉమ్మడి జిల్లాలో గిరిజనుల ఆందోళన పరిస్థితులపై వారు కూలంకశంగా వివరించామని బొజ్జుపటేల్ తెలిపారు. 49 జీవో అమలు కాకుండా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గత నెల ఉట్నూర్‌లో ఆదివాసీలతో సమావేశమైన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివాసీల మనోగతం, జీవో వచ్చిన తర్వాత ఆదివాసీల ఆవేదన, ఆందోళన గురించి ముఖ్యమంత్రితో వివరిస్తూ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ మంత్రి దనసరి సీతక్కలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జీవో గురించి వివరాలు తెలుసుకుని ఆదివాసులకు అన్యాయం చేసే జీవోని నిలిపివేయాలని నిర్ణయించారన్నారు.

అటవీ సిబ్బందికి డీఎఫ్‌వో పరామర్శ

ఆదిలాబాద్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలం కేశవపట్నంలో స్థానికుల దాడిలో గాయపడిన పోలిసు, అటవీ సిబ్బందికి రిమ్స్ లో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం డీ.ఎఫ్.వో ప్రశాంత్ పాటిల్ వారిని పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా డీ.ఎఫ్.వో ప్రశాంత్ పాటిల్ మాట్లాడుతూ.... అటవీ భూముల్లో అక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. తమ విధులకు ఆటంకం కలిగిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఫ్.ఆర్.వో గులాబ్ సింగ్, అటవీ సిబ్బంది ఉన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



● మృతి చెందిన రైతు సంతోష్ యాదవ్ (ఫైల్)

తలమడుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అప్పులు అధికమై బతుకు భారమై మండలంలోని కుచలాపూర్ గ్రామంలో ముక్కెర సంతోష్‌యాదవ్(47) అనే రైతు పురుగుల మందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కుచ్చులాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సంతోష్‌యాదవ్‌కు గత రెండేళ్ల నుంచి పంటలు సక్రమంగా పండడం లేదు. తనకున్న ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా వ్యవసాయం కోసం గ్రామీణ బ్యాంకులో రూ.రెండు వరకు అప్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీలో మాఫీ కాలేదు. రబీ పంటలో వేసిన జొన్న పంటకు నీరు అందక పోవడంతో మధ్యలోనే పంటలు ఎండిపోయాయి. ఈ సంవత్సరం పంటల కోసం మరో రూ.రెండు లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల భారం అధికం కావడంతో మనోవేదనకు గురై ఆదివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై రాధిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

సీఆర్‌టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీంపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): భీంపూర్ కస్తూర్బా విద్యాలయంలో హిందీ సీఆర్‌టీ పోస్టు కోసం హిందీ పండిత్ ఎంఎ, టెట్ అర్హతలు ఉన్న వారు ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో రజని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు దాటి వచ్చిన దరఖాస్తులు స్వీకరించమని స్పష్టం చేశారు.

ఆదివాసీల బంద్ సంపూర్ణం

- ఉట్నూర్ డిపోలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన బస్సులు
- జిల్లాకేంద్రంలో దుకాణాలను మూసివేయించిన నేతలు..
- అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసుల పటిష్ఠ బందోబస్తు

ఉట్నూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ కొమురంభీం ప్రాంతంలో ఫారెస్టు కన్జర్వేషన్ పేరుతో ప్రభుత్వం అమలులోకి 49 జీవోను రద్దు చేయాలంటూ సోమవారం ఆదివాసీ సంఘాలు ఇచ్చిన బంద్ విజయవంతంగా జరిగింది. మండల కేంద్రంలోని వ్యాపార సంస్థలు, వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఆదివాసీ సంఘాలకు చెందిన గిరిజన నాయకులు, గిరిజనేతర సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆదివాసీ సంఘాలు ఇచ్చిన బంద్‌కు మద్ధతు తెలిపాయి. ఉట్నూర్ డిపో నుంచి ఆర్టీసీ బస్సులు వెళ్లకుండా ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు డిపో వద్దకు చేరుకుని గేట్లు మూసివేశారు. ఆదివాసీల బంద్ పిలుపుతో ఉట్నూర్ పట్టణంలోని దుకాణాలు మూతబడి పోవడంతో ఉట్నూర్ అంబేద్కర్‌చౌరస్తా జనం జడలేక వెలవెల పోయింది. ఉట్నూర్ పట్టణంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఉమ్మడి జిల్లా తుడందెబ్బ అధ్యక్షుడు పురక బాపురావు, జిల్లా అధ్యక్షుడు పెందూరుదాదిరావుల ఆధ్వర్యంలో ఆదివాసులు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ కొన్ని తెరిచి ఉన్న ఫైనాన్స్ కార్యాలయాలను, ప్రైవేట్ బ్యాంకులను, పెట్రోల్‌బంకులను మూసి వేయించారు. మండలంలోని హస్నాపూర్, షాంపూర్, దంతంపల్లి, ఉట్నూర్, లక్కారం ప్రాంతాలలో దుకాణాలు మూసి వేశారు. ఉట్నూర్ బస్టాండ్‌లో బంద్‌తో ప్రయాణికులు లేక బస్టాండ్ వెలవెలబోయింది. ఎలాంటి అలజడలు జరగకుండా శాంతి భద్రతకు విఘాతం కలగకుండా పోలీసు బృందాలు ఆదివాసీ సంఘాలతో వెంటనే ఉండి ఎలాంటి అలజడులు జరగకుండా చూశారు. తుడందెబ్బ నాయకులు పురుకబాపురావు, పెందూరు దాదిరావు, మాజీ ఎంపీపీ పంద్రాజైవంతరావులు మాట్లాడుతూ ప్రభుత్వాలకు పులులపై ఉన్న ప్రేమ గిరిజనులపై లేకుండా పోతుందని విమర్శించారు. గతంలో కవ్వాల్ టైగర్‌జోన్ పేరుతో ఆదిలాబాద్, నిర్మల్ మంచిర్యాల జిల్లాల్లో ఉన్న అటవీ ప్రాంతాలలో పులుల సంరక్షణ కోసం గిరిజనులను అడవుల నుంచి ఖాళీ చేయిస్తూ గిరిజనుల జీవితాలతో ఆడుకున్నారని, ఈ సారి ఆసిఫాబాద్ జిల్లా గిరిజనులపై దృష్టి పెట్టి జీవో 49 విడుదల



ఉట్నూర్‌లోని అంబేద్కర్ చౌక్‌లో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

చేశారన్నారు. ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయకపోతే జరగబోయే పరిణామాలకు బాధ్యత వహించాలని గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు.

● ప్రశాంతంగా ముగిసిన బంద్

ఆదిలాబాద్ టౌన్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కారిడర్ పేరిట తీసుకువచ్చిన జీవో 49కు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాలు, తుడుం దెబ్బ పిలుపు మేరకు చేపట్టిన బంద్ ఆదిలాబాద్ పట్టణంలోని ప్రశాంతంగా ముగిసింది. జీఓను ఖండిస్తూ ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో వివిధ సంఘాల నేతలు సైతం సంపూర్ణ మద్ధతు తెలిపారు. ఇక పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. అంతకుముందు పట్టణంలోని బస్ స్టాండ్ ఎదుట ఆందోళన చేపట్టారు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. జీఓ రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. డీఎస్పీ జీవన్ రెడ్డితో పాటు పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. బంద్‌కు వామపక్ష పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళ సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ మాట్లాడారు. తుడుందెబ్బ నాయకులు గోడం రేణు, వెట్టి మనోజ్, ఉయిక ఇందిర, సోయం లలితబాయి, ముకుంద్, వామపక్ష నాయకులు దర్శనాల మల్లేష్, వెంకట్ నారాయణ, జగన్ సింగ్, రాజు, పరమేశ్వర్, అన్నమొల్ల కిరణ్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన 49 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఉమ్మడి జిల్లా బంద్ పిలుపులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా తుడందెబ్బ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఉయికే సుదర్శన్, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సైతం రమేష్, మండల ప్రెసిడెంట్ పెద్ది సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆయా సంఘాలు



నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

పని చేసినా.. పైసల్ రాలే

● కుల గణన డాటా ఎంట్రీ చేసిన బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు అందని డబ్బులు



7 లో

శిక్షణలోనే అసువులు బాసిన ఆర్మీ జవాన్

- 20కే రన్నింగ్‌లో డీహైడ్రేషన్‌కు లోనై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- వర్తమన్నూర్ గ్రామంలో విషాద ఛాయలు

బజార్‌హత్నూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): దేశ సేవ చేద్దామని వెళ్లి ఆర్మీ శిక్షణలో భాగంగా 20కే రన్నింగ్ చేస్తూ బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కుప్పకూలిన సంఘటన చోటు చేసుకుంది.

దీనికి సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్తమన్నూర్ గ్రామానికి చెందిన నలువల ఆకాశ్(23) అస్సాంలో రైఫైల్స్ రిజిమెంట్లో శిక్షణ పొందుతున్నాడు. అయితే, అస్సాంలో గత ఐదు నెలలుగా శిక్షణ పొందుతుండగా.. 5 కి.మీ.ల, 10 కి.మీ. పూర్తి చేసి శనివారం 20 కి.మీ పరుగు చేస్తున్న క్రమంలో డీహైడ్రేషన్‌కు గురయ్యాడు. వెంటనే ఆర్మీ అధికారులు అతడిని అంబులెన్స్ ద్వారా మిలిటరీ హాస్పిటల్‌కి చికిత్స కోసం తీసుకెళ్లారు. కర్బీఅంగ్లాంగ్ జిల్లాలోని మెడికల్ కాలేజి హాస్పిటల్‌లో సోమవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తమకు సమాచారం అందిందని కుటుంబీకులు తెలిపారు. దేశ సేవ కోసం వెళ్లి ఇలా శిక్షణ పూర్తికాక ముందే అనంతలోకాలకు వెళ్లడం జీర్ణించుకోని కుటుంబీకులు బోరున విలపిస్తున్న దృశ్యం అందరినీ కలిచి వేసింది. మృతుడికి తల్లి, తండ్రితో పాటు తమ్ముడు ఉన్నారు.



నలువల ఆకాశ్(ఫైల్)